# వయసు రహస్యం

"మృణాళినీ! కాస్త ఈ పెట్టె అటు పెడ్దాంరా...."

"... ... ..."

"అమ్మా! ఈ అల్మైరాలో నా పుస్తకాలు పెట్టుకుంటాను."

"ఏయ్! అక్కడ నా పుస్తకాలు పెట్టుకుంటాను."

"అబ్బబ్బ! ప్రతీదానికీ అలా కీచులాడుకోకండి. దాంట్లో నాల్గరలున్నాయ్! చెరు రెండరలు వాడుకోండి."

"రాధా! డైనింగ్ టేబు లెక్కడ పెడ్దాం?"

"అదిగో! ఆ గదిలో...."

పక్క వాటాలోకి కొత్తగా సామాన్తో సహా వచ్చేసినట్లున్నారు. వాళ్ళ హడావిడితో మెలుకువొచ్చింది. కిటికీలోంచి ఎండపొడ కొద్ది కొద్దిగా లోపలి కొస్తోంది.

'మొగగొంతు ఆయన్ది' తప్ప మరెవ్వర్దీ వినిపించడం లేదు. బహుశా ఆయనకి మొగపిల్లల్లేరేమో! అన్నీ ఆడ గొంతులే వినబడుతున్నాయ్! పర్లేదు - మంచి కాలక్షేపమే!

బద్ధకంగా వుంది. మెలుకువొచ్చినా లేవబుద్ధి పుట్టక అలానే పడుకున్నాను వాళ్ళమాటలు వింటూ!

"ఏరా! ఎనిమిదవుతున్నా ఇంకా లేవబుద్ధి పుట్టడం లేదా?" అమ్మ కేకతో నెమ్మదిగా మంచం దిగాను.

బ్రష్షందుకొని పెరటి గుమ్మంకేసి నడిచాను.

కథా నిలయం 3932

పెరట్లో రకరకాల మొక్కలున్నాయ్. వాటి మధ్యగా తిరుగుతూ పళ్ళు తోముకోవడం సర్దా!

పెరట్లోకి అడుగు పెట్టగానే కాళ్ళు, కళ్ళు ఆశ్చర్యంతో నిల్చిపోయాయ్

అందం... అందానికి తగ్గ శరీర సౌష్ఠవం.... ఎంత బావుందామె!

మృణాళినీ యేమో!

పూలు కోస్తున్నదల్లా నా రాక గమనించినట్లుంది. చివుక్కున తలెత్తి చూసి చర చరా లోపలికెళ్ళి పోయింది.

అదేమిటి! అలా చూసిందేమిటి నేనేదో క్షమించరాని తప్పుచేసినట్లు! ఆ పెరటిని రెండు వాటాల వాళ్లూ వాడుకుంటారు. వాళ్లదొక్కళ్లదే కాదే! ఆమె ప్రవర్తన కొద్దిగా బాధ కల్గించింది. అక్కడ నిలబడలేక గబగబా బాత్‌రూమ్‌లో కెళ్ళిపోయాను.

***

సాయంత్రం కాలేజీ నించీ వచ్చేసరికి అమ్మ, మృణాళినీ వాళ్ళమ్మగారు హాల్లో సోఫాలో కూర్చుని కాఫీ తాగుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు. కొద్దిగా ఇవతలిగా కూర్చుని తమ్ముడు, మృణాళిని కబుర్లు చెప్పుకుంటున్నారు.

సందేహిస్తూనే లోపలికి అడుగు పెట్టాను.

అంతదాకా నవ్వుతూ తమ్ముడితో మాట్లాడుతున్న దల్లా నన్ను చూడగానే లేచి తమ వాటాలోకి వెళ్ళిపోయింది మృణాళిని!

ఛెళ్ళున చెంపమీద కొట్టినట్లనిపించిందామె ప్రవర్తన.

వీడే మా పెద్దాబ్బాయ్!" మృణాళిని అమ్మగార్కి నన్ను పరిచయం చేసిందమ్మ. అప్రయత్నంగానే నమస్కారం చేశాను.



"ఏం చదువుతున్నావ్ బాబూ?" అడిగారావిడ.

"బి.యస్.సి.ఫైనలియర్"

"మృణాళిని కూడా బి.యస్.సి.నే చదువుతోంది. మొదటి సంవత్సరం"

ఊహూ! అన్నట్లు తలూపి వూరుకున్నాను.

వాళ్లిద్దరూ తిరిగి కబుర్లలో పడ్డారు.

గబగబా నా రూమ్‌లోకెళ్ళి పుస్తకాలు పడేసి, తిరిగి బయటికి బయల్దేరాను.

మనస్సు చికాగ్గా తయారైంది.

ఆ అమ్మాయి నన్ను చూడగానే ఎందుకలా పారిపోతుంది? తన కంటికి నేనంత దుష్టుడిలాగా కనబడుతున్నానా! ఒకవేళ తనేమైనా వెకిలిగా ప్రవర్తించాడు అంటే అసలింతవరకూ ఆమెని పరీక్షగా చూడను కూడా చూళ్ళేదే! మరెందుకలా ప్రవర్తిస్తోంది? ఎదుటి మనిషి బాధపడతాడనే భావం కూడా ఆమెకుండదా?

ఆమె రూపం మరోసారి కంటిముందు తళుక్కుమంది.

తనెందగత్తెననే గర్వమేమో!

తనందగత్తయితే మాత్రం! ఎదుటివాడు వెధవనుకుంటోందా? అందరూ తనందాన్ని చూసి వెకిలిగా వెంటబడతారనుకుంటోందా వాళ్ళకి వ్యక్తిత్వం, మానాభిమానాలుంటాయనీ ఆమెకి తెలీదా?

ఆమె ప్రవర్తనవల్ల చాలా బాధ కల్గింది. ఒకవేళ తనెక్కడైనా కన్పించినా తలెత్తి కూడా చూడకూడదని నిశ్చయించుకున్నాను.

కాసేపలా అలా తిరిగి ఇంటికి జేరుకున్నాను.

పెరటి గుమ్మంలో నిలబడి అమ్మతో మాట్లాడుతోంది మృణాళిని.

నన్ను చూడగానే రాక్షసుడ్ని చూసినట్లు పరుగెత్తుతుంది రాబోలు! విసుగ్గా వాకిట్లో కుర్చీలో కూలబడ్డాను.

రకరకాల ఆలోచన్లు మనసుని ముసురుకోసాగాయ్.

నన్ను చూడగానే ఆమెందుకలా బెదిరిపోతుంది?

ఇంతకు ముందు వాళ్ళు రెండు వీధులవతలుండే వాళ్ళట! పోనీ ఈ ఇంట్లోకి రాకముందు నేనెవరైనా ఆడ పిల్లని గోల చేస్తుండగా చూసిందేమో భయపడి పోతోందనుకోడాన్కి నేనెప్పుడూ ఏ ఆడపిల్లతోనూ అసభ్యంగా ప్రవర్తించెరుగను. కనీసం ఏ ఆడపిల్లతో నైనా రోడ్డు మీద నిలబడి మాట్లాడే అదృష్టానిక్కూడా నోచుకోలేదు నేను! మరెందుకీమె ఇట్లా ప్రవర్తిస్తోంది?

మొగవాళ్లంటే ఆమెకున్న నీచభావాన్ని తొలగించాలి. అందరు మొగవాళ్ళు అందమైన ఆడపిల్ల కన్పించగానే వెనుకబడరని నిరూపించాలి. గట్టిగా నిశ్చయించుకున్నాను.

మర్నాడు సాయంత్రం సెంటిమెంటల్‌గా మరో దెబ్బతిన్నాను.

నేను కాలేజి నుంచి వచ్చేప్పటికి నాన్నగార్తో మాట్లాడు తున్నదల్లా మృణాళిని నన్ను చూడగానే వెళ్ళిపోయింది.

నాన్నగార్తో మాట్లాడుతుంది. అమ్మతో మాట్లాడుతుంది నన్ను చూడగానే మాత్రం పరుగెడుతుంది! అంటే నేననుకున్నట్లు ఆమెకి గర్వంలేదు. కానీ మరి నే నామె దృష్టిలో అంత రాక్షసుడిగా ఎందుకు చిత్రించ బడ్డానో ఎంతాలోచించినా అర్థం కావడం లేదు.

దాదాపు పదిరోజులు గడిచిపోయినై. మృణాళినికి మా ఇంట్లో వాళ్ళందరితోనూ బాగా చనువేర్పడింది - నాతో తప్ప. నన్ను చూట్టం అలస్యం పరుగే!

ఆ రోజు బస్టాప్‌లో నిలబడి ఆ విషయమే ఆలోచిస్తున్నాను.

దాదాపలా ఓ అరగంట నిలబడ్డ తర్వాత బస్సొచ్చింది.

అప్పటికే సీట్లన్నీ నిండిపోయాయ్! నల్గురైదుగురు నిలబడి కూడా వున్నారు. నాతోపాటే ఆ స్టేజీలో మరో ముగ్గురు కుఱ్ఱాళ్ళెక్కారు. అందరం గేటు దగ్గర నిలబడ్డాం.

తర్వాత స్టేజీలో ఎవ్వరూ దిగలేదు కాని మరో ఇద్దరెక్కారు. బస్సు బయల్దేరబోతున్న సమయంలో ఒకావిడ హడావిడిగా పరుగెత్తుకుంటూ వచ్చి మేం నిలబడ్డ ద్వారం గుండా ఎక్కింది బస్సు.

ఆమెకి సుమారు నలభై సంవత్సరాలుంటాయ్. పరుగెత్తుకు రావడం వల్ల మొహమంతా చెమట పట్టింది. ఆయాసపడుతోంది.

ఒక్క నిముషం అలానే నిలబడి బస్సంతా పరికించి చూసింది. ముందు లేడీస్ సీట్లలో ఒక సీటు ఖాళీగా వుంది.

ఆమె మొహం ఆనందంతో వికసించింది. కర్చీఫుతో మొహం తుడుచుకుంటూ గబగబా అటు బయల్దేరింది. ఆ వెళ్ళే హడావిడిలో మా కాళ్ళు తొక్కుతున్నది కూడా ఆమె గమనించడం లేదు. మమ్మల్ని తోసుకుంటూ, రాసుకుంటూ మామధ్య నించీ ముందుకు బయల్దేరింది.

నాల్గైదడుగులేసిం తర్వాత సడెన్‌గా ఆగిపోయింది.

అంత సడెన్‌గా ఆమె ఆగిపోయేసరికి ఆశ్చర్యం వేసింది - ఎందుకాగి పోయిందా అని అటు చూశాను. వెంటనే నాకు నవ్వొచ్చేసింది.

ఆమె ముందు దారి కడ్డంగా సుమారు ఆమె వయస్సేవున్న ఒకాయన నిలబడున్నాడు. అతనీమెని గమనించడంలేదు. అటువేపు తిరిగి నిలబడున్నాడు. ఆమె ముందుకెళ్ళాలంటే అతడ్ని తాకుతూ వెళ్ళాల్సిందే. పక్కకి తప్పుకోమని అతనికి చెప్పడానిక్కూడా ఆమె సిగ్గుపడి పోతోంది. మా మధ్య నించీ అలా దూసుకుపోయిన మనిషి మరతని దగ్గరంతగా సిగ్గెందుకు పడ్తోందో? హఠాత్తుగా తట్టింది నాకు.

ముందు నిలబడ్డ మేము తనకన్నా చిన్నవాళ్లం. అందుకని మాకు తన శరీరం తగుల్తున్నా బిడియం లేకుండా ధైర్యంగా ముందుకెళ్లి పోయింది. కానీ అక్కడ నిలబడ్డతను ఆమె వయసు వాడవడంతో - అప్పుడామెకి తను స్త్రీ, అతను పురుషుడు అన్న భావన కల్గింది. ఆ భావన ఆమెకి సహజంగా సిగ్గుని కల్గించింది. అందుకే అతన్తో మాట్లాట్టానిక్కూడా సంశయిస్తోంది.

నాకు ఠక్కున మృణాళిని గుర్తుకొచ్చింది. అప్పుడు నా కర్థమైంది. మృణాళిని, నేను ఇంచుమించు ఒక వయసు వాళ్ళమే. అందుకే నాతో మాట్లాడదు. నన్ను చూస్తే బెదిరిపోతుంది. ఆ మరుక్షణం మృణాళిని మీద పేరుకున్న కోపమంతా మంచులా కరిగిపోయింది. *

(ఆంధ్ర సచిత్ర. వారపత్రిక 26-5-78)